అందెశ్రీకి ఆత్మీయ సన్మానం



లక్కరాజు నిర్మలకు నిప్పుల వాగు పుస్తకాన్ని అందజేస్తున్న అందెశ్రీ

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర గీత రచయిత డా. అందెశ్రీకి ఆత్మీయ మహిళా మండలి అధ్యక్షురాలు డా. లక్కరాజు నిర్మల ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం జరిగింది. బుధవారం తార్నాకలోని ఆత్మీయ సంస్థను అందెశ్రీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆత్మీయ సంస్థ బృందం శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం లక్కరాజు నిర్మలకు అందెశ్రీ తన రచన నిప్పుల వాగు పుస్తకాన్ని అందజేశారు.

అయ్యప్ప మహాపడి పూజకు ఆహ్వానం



తలసానికి ఆహ్వాన పత్రికను అందిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: శ్రీధర్మ శాస్త్ర భక్త బృందం ఆధ్వర్యంలో ఈ నెల 14న జరుగనున్న 26వ వార్షిక అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమానికి నిర్వాహకులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఆహ్వానం పలికారు. మారేడుపల్లిలోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. గత 26 ఏళ్లుగా అయ్యప్ప మహాపడిపూజను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

మీడియా సిబ్బందిపై దాడికి ఓయూలో నిరసన



ఓయూలో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

ఉస్మానియా యూనివర్సిటీ: సినీ నటుడు మోహన్‌బాబు మీడియా సిబ్బంది పై దాడి చేయడంతో ఓయూలో జర్నలిస్టులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు నిరసన తెలిపారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట మోహన్‌బాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మీడియా సిబ్బందికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం మోహన్ బాబును పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఓయూ ఏసీపీ జగన్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో విక్రమ్‌గౌడ్, కిరణ్‌కుమార్, శ్రీకాంత్, నరసింహరాజు, గణేష్, విశ్వంగౌడ్, తిరుమల్ రెడ్డి, కిరణ్‌గౌడ్, ఫణీంద్రా చారి, రాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఏబీవీపీ భాగ్యనగర్ మహాసభలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో జరుగుతున్న ఏబీవీపీ భాగ్యనగర్ మహాసభలు బుధవారం ముగిశాయి. ఓయూ క్యాంపస్ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన మహాసభల్లో వివిధ అంశల పై చర్చించినట్లు నాయకులు పృథ్వీతేజ తెలిపారు. అనంతరం గ్రేటర్ హైదరాబాద్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో ప్రొ.రామకృష్ణ, పడిగిపల్లి శ్రీహరి, జీవన్, సుమన్ శంకర్, సురేష్, దృహన్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్లోంచి జారిపడి వ్యక్తి మృతి

సికింద్రాబాద్: నడుస్తున్న రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. విశాఖపట్నం నుంచి ముంబై వెళ్తున్న రైలు మౌలాలి రైల్వే స్టేషన్‌కు చేరుకున్న సమయంలో కుదుపునకు గురైంది. ఆ సమయంలో బోగీ డోర్ దగ్గర నిల్చున్న వ్యక్తి కింద పడి పోయాడు. ఈ ప్రమాదంతో తీవ్రంగా గాయపడ్డ అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకుని ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గుర్తింపు కార్డు ఆధారంగా మృతుడు శ్రీకాకుళం జిల్లా జగన్నాథపురానికి చెందిన వెల్డర్ డి. లింగమూర్తిగా గుర్తించారు. మృతుడి బంధువులకు సమాచారం అందించిన పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

యువకుడి అదృశ్యం

అడ్డగుట్ట: పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన మేరకు.. అడ్డగుట్టకు చెందిన శ్రీనాథ్(25) డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 8న ఉదయం పనికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి శ్రీనాథ్ తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు తెలిసిన వారిని వాకబు చేసినా ఫలితం లేక పోవడంతో బుధవారం స్థానిక తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆస్పత్రి సరే.. వైద్యం ఏదీ?

అనారోగ్యమొస్తే ఆశగా ఆస్పత్రికి వెళతాం.. అయితే లాలాపేట పట్టణ ఆరోగ్య కేంద్రానికి వెళితే మాత్రం వైద్యం అందడం అనుమానమే.. అక్కడ పేరుకే ఆస్పత్రి ఉన్నది కానీ వైద్యులు మాత్రం అందుబాటులో ఉండరు. దీంతో వైద్యం దొరికేది అంతంతే.. ఈ కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- లాలాపేట



దెబ్బతిన్న పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ

- లాలాపేట పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్వహణ గాలికి
- గైనకాలజిస్టు, పిల్లల వైద్యులు లేక ఇబ్బందులు
- మల్కాజిగిరికి పంపుతున్న వైనం
- మందుబాబులకు అడ్డాగా మారిన దవాఖానా

లాలాపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో సూపరిటండెంట్‌తోపాటు ఆరుగురు వైద్యులు ఉండాలి.అయితే అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం వల్ల కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఉన్న ఇద్దరితో వచ్చే పేషెంట్లకు వైద్యం అందని ద్రాక్షే అయింది.

- లాలాపేట వాసులు చిన్న గాంధీ హాస్పిటల్‌గా పిలుచుకునే పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్వహణ మరీ అధ్వానంగా తయారైంది. హాస్పిటల్ నిర్వాహణకు పూర్తిగా గాలికి వదిలేశారు.
- గైనకాలజిస్టు లేక ప్రసవాలు నిలిచిపోయాయి. చిల్డ్రన్ స్పెషలిస్టు లేక పిల్లలకు వైద్యం లభించడం లేదు. కొన్ని నెలల నుంచి ఇక్కడ వైద్యం అందక, మందులు లేక వెల వెల బోతోంది.



ఆస్పత్రి ఆవరణలో మద్యం సీసాలు



లాలాపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రం

- దీంతో బాలింతలు, గర్భిణీ స్త్రీలను, చిన్న పిల్లలను మల్కాజిగిరికి వెళ్లాల్సి వస్తోంది. ఉన్న ఇద్దరు వైద్యులు, అరకొరా సిబ్బంది సమయపాలన పాటించడం లేదు.
- ఇక హాస్పిటల్ ప్రహరీ శిథిలావస్థకు చేరడంతో దీన్ని కొందరు రాత్రి వేళల్లో మద్యం తాగేందుకు ఉపయోగించుకుంటున్నారు. ఆరోగ్య సేవలు అందించాల్సిన హాస్పిటల్, దాని పరిసరాలు మందు బాబులకు అడ్డాగా, అసాంఘీక కార్యకలాపాలకు నిలయంగా మారింది.
- నిత్యం దాదాపు 100 మందికి పైగా పేషంట్లు, బాలింతలు, గర్భిణీ స్త్రీలు వస్తూ వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు.
- అధికారులు ఇప్పటికైనా ఆస్పత్రిపై దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆ ఎమ్మెల్యేలు క్షమాపణ చెప్పాలి



నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎమ్మెల్సీ కవిత పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, యోన్నం శ్రీనివాస్ రెడ్డికి ఓయూ నుంచి బీఆర్‌ఎస్‌వీ నాయకులు మెడికల్ కిట్లను పంపించారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట బీఆర్‌ఎస్వీ నాయకులు డా.కందుల మధు, కె.విజయ్ రావుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు బీర్ల, యోన్నంల మానసిక స్థితి బాగలేదంటూ మెడిసిన్స్‌ను ప్రదర్శిస్తూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కవిత పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీర్ల, యోన్నం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవికిరణ్, వేల్పుకొండ రామకృష్ణ, గుమ్మడి క్రాంతి పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



తిరుమలగిరిలో ఫుట్‌పాత్‌లపై అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం



కూల్చివేతల్లో పాల్గొన్న ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే

రసూల్‌పురా: తిరుమలగిరి పరిధిలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను నార్త్‌జోన్ ట్రాఫిక్ పోలీసులు, కంటోన్మెంట్ బోర్డు అధికారుల సహకారంతో బుధవారం తొలగించారు. లాల్‌బజార్ నుంచి ఫుట్‌బాల్ మైదానం వరకు రాజీవ్ రహదారికి ఒకవైపు అక్రమ వ్యాపార దుకాణాలను జేసీబీతో తొలగించారు. ఫుట్‌పాత్‌లు, రోడ్లు ఆక్రమించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, బోర్డు హెల్త్ సూపరిటెండెంట్ ఎం. దేవేందర్ హెచ్చరించారు. కార్యక్రమంలో నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్ రాజు, తిరుమలగిరి ట్రాఫిక్ సీఐ మధుబాబు, ఎస్ఐ నాగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



క్రిస్మస్ స్పెషల్..

మార్కెట్‌కు క్రిస్మస్ కళ వచ్చేసింది. పండుగకు సంబంధించిన డెకరేషన్ వస్తువులు క్రిస్మస్ ట్రీ, స్టార్లు, శాంతాక్లాజ్, రంగు రంగుల మెరుపులతో తోరణాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. తార్నాక నుంచి హబ్సిగూడ వెళ్లే ప్రధాన రహదారిలో క్రిస్మస్ వస్తువులు లభిస్తున్నాయి.
– లాలాపేట

ఓయూ ఈఎంఎంఆర్‌సీ లఘు చిత్రానికి అవార్డు



రూ.50 వేల చెక్‌ను అందచేస్తున్న వీసీ ప్రొ.కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఈఎంఎంఆర్‌సీ రూపొందించిన లఘుచిత్రానికి అవార్డు లభించింది. ఈ నెల 4 నుంచి 6 వరకు యూజీసీ-సీఈసీ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన 16వ అంతర్జాతీయ లఘుచిత్ర పోటీలో అవార్డు లభించినట్లు డైరెక్టర్ పి.రఘుపతి తెలిపారు. అవార్డు కింద లభించిన రూ.50 వేల నగదును ఓయూ పాలన భవనంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో వీసీ ప్రొ.కుమార్ చేతుల మీదుగా ఆదివాసీల విద్య కోసం కృషి చేస్తున్న సంతోష్, ఇస్రం మిత్రబృందానికి విరాళంగా అందచేశారు.

కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డికి పలువురి శుభాకాంక్షలు



కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న లైబ్రేరియన్ హరిబాబు

సనత్‌నగర్: హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డికి సనత్‌నగర్, ఎస్సార్‌నగర్ గ్రంథాలయాల గ్రంథపాలకుడు హరిబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు హైదరాబాద్ నగర గ్రంథాలయ ఉద్యోగుల సంఘం యూనిట్ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, మహేష్ శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

నాడు బీఆర్‌ఎస్, నేడు కాంగ్రెస్..

- ప్రజలను మోసం చేస్తున్న రెండు పార్టీలు



ఇందిరమ్మనగర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న రామకృష్ణ

రసూల్‌పురా: నాడు బీఆర్‌ఎస్, నేడు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు కంటోన్మెంట్ ప్రజలను మోసగిస్తూనే ఉన్నాయని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ అన్నారు. బోర్డు రెండవ వార్డు ఇందిరమ్మనగర్‌లో బోర్డు నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానికులు తాగునీటి సమస్యతో పాటు పలు సమస్యలు పరిష్కరించాలని రామకృష్ణను కోరారు. అనంతరం నామినేటేడ్ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ ప్రజల జనాభా అవసరాలకనుగుణంగా సరిపడా తాగునీరు విడుదల చేయకపోవడంతో బోర్డు ద్వారా తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని అన్నారు. ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుండగా హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రితోపాటు స్థానిక ఎమ్మెల్యేకూడా సరిపడా నీళ్ళు అందిస్తున్నామని మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ గెలిచిన ఏకైక ఎమ్మెల్యే నియోజకవర్గమైన కంటోన్మెంట్‌లోనే సమస్యలు తీర్చడం లేదంటే రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఏ విధంగా ఉందనేది అర్థం చేసుకోవచ్చని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకులు ఇకనైనా ఫ్యాషన్‌షోలు చేయడం మానుకోని కంటోన్మెంట్ ప్రజలకు సరిపడా తాగునీరు విడుదల చేసేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావాలని హితవు పలికారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు మాదారపు అశోక్. నాయకులు జయ యాదవ్, మమతా, రేఖ ప్రశాంత్, శ్యామ్, స్థానికులు లక్ష్మణ్, పాండు. రాజు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాటు 'గీతాంజలి' వేడుకలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గీతాకరణ్, జైకరణ్, మాధవీచంద్ర, కార్తీక్ రమణ తదితరులు

సనత్‌నగర్: గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ 40 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ నెల 15 నుంచి ఏడాది పాటు వేడుకలు నిర్వహించనున్నారు. ఆయా కార్యక్రమాల్లో గీతాంజలి పాఠశాలల్లో చదువుకుని వేర్వేరు రాష్ట్రాలు, విదేశాల్లో స్థిరపడ్డ వారంతా భాగస్వాములను చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. బేగంపేటలోని గీతాంజలి స్కూల్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపకురాలు డాక్టర్ గీతాకరణ్, మేనేజింగ్ డైరెక్టర్ జైకరణ్, అసోసియేట్ డైరెక్టర్ మాధవీచంద్ర తదితరులు 40 ఏళ్ల సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రస్తుతం ఆరు పాఠశాలల్లో 7,000 మంది విద్యార్థులు విద్యనభ్యస్తున్నారని చెప్పారు.

ఇలాగైతే రాకపోకలు సాగేదెలా..?



బాలయ్యనగర్‌లో రోడ్డుపై అక్రమ పార్కింగ్



గ్రీనరీ పేరుతో రోడ్డును ఆక్రమించిన దృశ్యం

సనత్‌నగర్: డివిజన్ పరిధిలోని బాలయ్యనగర్‌లో రహదారులు వాహనాలకు పార్కింగ్‌లుగా మారాయి. ఇరువైపులా వాహనాల పార్కింగ్ చేస్తుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు గ్రీనరీ పేరుతో కొంతమేర రోడ్డును ఆక్రమించేశారు. ఉన్న కొద్ది పాటి రోడ్డులో ఇబ్బడి ముబ్బడిగా పార్కింగ్ చేస్తుండడంతో వాహనదారులు నానా తంటాలు పడుతున్నారు. కాలనీల్లో రోడ్డుపై అక్రమ పార్కింగ్‌ల వ్యవహారంపై కూడా ట్రాఫిక్ పోలీసులు దృష్టిసారిస్తే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి



మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: డివిజన్ పరిధిలో మంచినీటి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని నీమ్‌కార్‌నగర్ నుంచి బీజేఆర్‌నగర్ వరకు రూ.75 లక్షలతో, ఎస్‌ఆర్‌టీ కాలనీలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన మంచినీటి పైప్‌లైన్ పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా ఈ పనులను పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో డీజీఎం వంశీకృష్ణ, మేనేజర్ ఇందుజ, బీఆర్‌ఎస్ నాయకులు మీర్జా ఖలీల్ బేగ్, రాజు, రాజేష్‌ముదిరాజ్, మోహన్, పురుషోత్తం, సురేందర్‌గౌడ్, సందీప్ తదితరలు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయ విగ్రహ పునః ప్రతిష్ఠ

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ దేవాలయ విగ్రహ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం వైభవంగా సాగింది. మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు వందలాది మంది భక్తుల సమక్షంలో అమ్మవారు పూజలు అందుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారి దేవాలయాన్ని పునర్నిర్మించడంతో పాటు, కాంస్య విగ్రహాన్ని దేవదాయ శాఖ తయారు చేయించింది. స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్, స్థానిక కాంగ్రెస్ నాయకులు కలిసి దేవాలయంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. మూడు రోజుల పాటు భక్తులకు అన్నదానం చేపట్టారు.



చీరలు పంపిణీ చేస్తున్న కొండా సురేఖ, ఎమ్మెల్యే శ్రీగణేష్

మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు శ్రీగణేష్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, కార్పొరేటర్ కొంతం దీపిక, మాజీ కార్పొరేటర్లు ఆకుల రూప, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నాగేందర్, తలసాని సైకిలాబ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. మహిళా భక్తులకు మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా చీరలు, పసుపు కుంకుమ, గాజులు పంపిణీ చేశారు.

చేనేత వస్త్రాలు ధరించి ప్రోత్సహిద్దాం



శ్రీనగర్‌కాలనీ: తెలంగాణ చేనేత కళాకారుల్లో విశేష ప్రతిభ ఉన్నదని, చేనేత వస్త్రాలను ధరించి వారికి ప్రోత్సాహాన్ని అందిద్దామని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. బుధవారం శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటు చేసిన వస్త్ర ప్రదర్శనలో వస్త్రాలను తిలకించి చేనేతకారులను అభినందించారు. తామంతా చేనేత వస్త్రాలతో ధరిస్తామని, ఇక్కడి చీరలు చాలా నాణ్యతతో పాటు అరుదైన చీరలున్నాయన్నారు. దేశంలో ప్రముఖ ప్రాంతాల చేనేత వస్త్రాలను ఒకచోట చేర్చి నేరుగా వినియోగదారులకు అందించడం శుభపరిణామన్నారు. మన బాధ్యతగా చేనేత వస్త్రాలను ధరించాలని కోరారు. శుభకార్యాలు, పండుగలకు ముఖ్యంగా సంక్రాంతి పండుగకు విభిన్న, కొంగొత్త రంగుంగుల చేనేత వస్త్రాలైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలు సుమారు 80 స్టాల్స్‌లో అందుబాటులో ఉంచామని, ఈనెల 15వరకూ ఈ ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు వినయ్‌కుమార్, శ్రీనివాసరావు తదితరులు తెలిపారు.

మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెప్పాలి



6 అబద్ధాలు.. 66 మోసాల కరపత్రం ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

చిలకలగూడ : ఆరు అబద్ధాలు, 66 మోసాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి నేతృత్వంలో సీతాఫల్‌మండి అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాంచందర్ రావు మాట్లాడుతు తెలంగాణ ఇచ్చింది సోనియాగాంధీ అని కాంగ్రెస్, తెచ్చింది కేసీఆర్ అని బీఆర్‌ఎస్ నాయకులు చెప్పుకుంటున్నారని, వాస్తవానికి తెలంగాణ బిల్లు ఆమోదం కోసం పార్లమెంట్‌లో కొట్లాడింది బీజేపీ నేత సుష్మాస్వరాజ్ అని అన్నారు. రెండు సార్లు బీఆర్‌ఎస్‌కు, ఒకసారి కాంగ్రెస్ అధికారం ఇచ్చి ప్రజలు మోసపోయారని, మార్పు కావాలంటే ఈమారు బీజేపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌సుందర్‌గౌడ్, మేకల సారంగపాణి పాల్గొన్నారు.

కిమ్స్ వైద్యుల అరుదైన చికిత్స

రాంగోపాల్‌పేట్: అత్యంత బలహీనంగా ఉన్న గర్భసంచితో ఓ మహిళకు నాలుగు సార్లు అబార్షన్ కాగా సికింద్రాబాద్ కిమ్స్ వైద్యులు చికిత్స చేసి గర్భాన్ని నిలబెట్టారు. కిమ్స్ సీనియర్ కన్సల్టెంట్ గైనకాలజిస్టు లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ చీపురుపల్లి వసుంధర తెలిపిన మేరకు.. నగరానికి చెందిన 27 ఏళ్ల యువతికి ఇప్పటికే నాలుగు సార్లు అబార్షన్ అయింది. కిమ్స్ వైద్యులను సంప్రదించడంతో లాప్రోస్కోపిక్ అబ్డామినల్ సర్క్లోజ్ చికిత్స చేసి గర్భాన్ని నిలబెట్టారు. ఆ తరువాత 9 నెలలు నిండటంతో సిజేరియన్ పద్ధతిలో ప్రసవం చేశారు.